# మనుషులు మారతారు!

-మాచిరాజు కామేశ్వరరావు

"అన్నయ్యా... అన్నయ్యా! నిన్నే ఈ వైపు చూడు!" కోఠి బజారులో రోడ్డుకు ఆవైపునుంచి చప్పట్లు చరుస్తూ గట్టిగా ఎవరో నన్నే పిలుస్తున్నారు.

ఆ అమ్మాయికి పాతికేళ్లుంటాయి.

ఎవరో గుర్తుకు రావడంలేదు.

పిలుస్తున్నది నన్నో కాదో అని ఓసారి ఆ ప్రక్కకి ఈ ప్రక్కకి చూసుకున్నాను.

"నిన్నే అన్నయ్యా. వుండు నేనే వస్తాను" రోడ్డు దాటుకుని తనే వచ్చింది ఆ అమ్మాయి.

ఇప్పుడు గుర్తుపట్టాను.

సులక్షణ!

నన్ను నోరారా అన్నయ్యా అని పిలిచేది సులక్షణ ఒక్కతే!

శేఖరం పెళ్లిలోనే ఆఖరుసారిగా తనని చూడడం! అప్పుడే ఆరేళ్లయిపోయింది. మనిషి అప్పట్లోలా పీలగా లేదు. ఒళ్లు చేసి రంగు తేలింది. మెళ్లో నల్లపూసలు, కాళ్లకు మట్టెలు. మనిషికి హుందాతనాన్ని తెచ్చిపెట్టాయి.

"ఇంకా గుర్తుపట్టలేదా అన్నయ్యా?" కుడిచేతిలో బరువుగా వున్న ప్లాస్టిక్ బుట్టను ఎడమచేతిలోకి మార్చుకుంటూ నవ్వింది సులక్షణ.

"నన్ను ఇంతమంది జనంలో అంత దూరంనుంచి గుర్తు పట్టగలిగావ్. నువ్వింత దగ్గరగా వచ్చినా గుర్తుపట్టలేననుకుంటున్నావా సులక్షణా?"

"హమ్మయ్యా! పదినిముషాలుగా నిన్ను గమనిస్తున్నాను. ఏ ఆటో అయినా ఎక్కేస్తావేమోనని గబగబా నీ వెనకే వస్తున్నాను. శేఖరం అన్నయ్య పెళ్లయ్యాక ఎంత లావయిపోయాడో తెలుసా అన్నయ్యా? నువ్వు మాత్రం బొత్తిగా మారలేదు"

గలగలా మాట్లాడేస్తోంది సులక్షణ. ఆ గొంతులో మునుపటి ఆదరణ, ఆత్మీయత చెక్కుచెదరలేదు.

మేం విశాఖపట్నంలో వున్నప్పుడు శేఖరంతో పరిచయం. నాన్నగారు జైలు సూపర్నెంటు. ఆ జైలు క్వార్టర్స్‌లో నా ఈడుజోడు వాళ్లు ఎవరూలేరు. నేను బి.కాం మూడేళ్లు శేఖరం ఇంట్లోనే కంబైండ్ స్టడీ చేసేవాడిని. ఎగ్జామ్స్ అప్పుడు మాకన్నా మూడేళ్లు చిన్నదయిన సులక్షణ రాత్రి రెండుమూడుసార్లు టీ పెట్టి ఇస్తుండేది మాకు. వాళ్లింట్లో చదువుకున్న నేను బికాం ఫస్ట్‌క్లాసులో పాసయ్యాను. శేఖర్‌కి థర్డ్‌క్లాస్ వచ్చింది. డిగ్రీ చేతికొచ్చిన ఏడాదిలోనే కెనరా బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చేసింది నాకు. హైదరాబాద్ వచ్చేసాను. శేఖరం వైజాగ్‌లోనే ఏదో ప్రైవేట్ కంపెనీలో చేరాడు. ఆరేళ్ల క్రితం శేఖరం పెళ్లికి వైజాగ్ వెళ్లాను నేను వాడు నా పెళ్లికి రాకపోయినా! ఆ తరువాత ప్రమోషన్‌మీద నేను పంజాబ్ వెళ్లిపోయాను. సహజంగా ఉత్తరాలు రాయడానికి బద్ధకించే శేఖరం పెళ్లయ్యాక ఏడాదికి వ్రాసే రెండు మూడు ఉత్తరాలు కూడా రాయడం మానేసాడు.



### కథ వెనక కథ

మా నాన్నగారు కీ.శే. శ్రీ సీతారామయ్యగారు జైలు డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగి కావడంతో మా బాల్యం అంతా జైలు ఆవరణలో వుండే క్వార్టర్స్‌లోనే గడిచింది. జైలులో ఖైదీలే మా ఇంటి పనులు అంతా చేస్తుండేవారు. మా చుట్టాలు, స్నేహితులు ఇంట్లో ఖైదీలు తిరుగుతుంటే భయం వేయదా వీళ్లకి అంటూ ఆశ్చర్యపోతూ వుండేవారు. మేం కరీంనగర్‌లో నాలుగేళ్లు వున్నప్పుడు మల్లయ్య అనేఖైదీ ఐదారుసార్లుదొంగతనం నేరంమీద జైలుకు వచ్చాడు. వచ్చినప్పుడల్లా బుద్ధి వచ్చిందనీ, ఇకపై నీతిగా కష్టపడి పని చేసుకుంటాననీ కబుర్లు చెప్పేవాడు. విడుదల అయి వెళ్లిన మూడు, నాలుగు నెలలకే మళ్లీ తయారు! "మనుషులు సినిమాల్లోలా జీవితంలో మారరు" అనేది మా అమ్మ. ఈ కథకి ప్రేరణ ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో, ఎలా ఉన్నాడో తెలియని ఆ ఖైదీ మల్లయ్య!

-మాచిరాజు కామేశ్వరరావు
ఆఫీసరు, కెనరా బ్యాంకు
రీజనల్ ఆఫీసు
నారాయణగూడా
హైదరాబాద్.



ఇంట్లోనూ, బ్యాంకులోనూ కూడా బాధ్యతలు పెరగడంతో నేను కూడా పాత మిత్రులందరినీ జనవరి ఫస్టున న్యూఇయర్ గ్రీటింగ్స్‌తో పలకరిస్తుంటాను.

''అదేంటన్నయ్యా బెల్లం కొట్టిన రాయిలా అలా నిలబడిపోయావేం? ఏదయినా మాట్లాడు'' చనువుగా నా భుజం కుదిపింది సులక్షణ.

''నీ పెళ్లెప్పుడయిందమ్మా? నాకు శుభలేఖ కూడా వేయలేదేం?''

''ఏడాది అయిందన్నయ్యా! నీకు పంజాబ్‌కి కార్డు నేనే పోస్టు చేసాను''

''నేను మన స్టేట్‌కొచ్చి ఏడాది అవుతోంది. అందుకే అందినట్లు లేదు''

''రోడ్డుమీద ఎంతసేపు మాట్లాడుకుంటాం. కాచీగూడ స్టేషన్ దగ్గరే మా ఇల్లు. రా అన్నయ్యా'' చెయ్యి పట్టుకుంది సులక్షణ.

''నేను రాత్రి 7.30కి ధర్మవరం ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి. కొంచెం బ్యాంక్ పని వుంది. సాయంత్రం ఆరింటికల్లా హోటల్ రూమ్ ఖాళీ చేసి మీ ఇంటికి వస్తాను'' టైం చూసుకుంటూ అన్నాను నేను.

''మా ఇంట్లో భోజనం చేసి వెళ్లాలి. మా ఆయనకి ఫోన్ చేసి ఆరింటికల్లా వచ్చేయమంటాను. తప్పకుండా రావాలిసుమా'' నాకో చీటిమీద అడ్రస్ రాసిచ్చి ''కుమార్ టాకీస్ దాటాక కుడిసందు'' అంటూ ఇంటికి రిక్షా మాట్లాడుకుంది.

నేను అనుకున్నట్లుగా అన్ని పనులు చూసుకుని సరిగ్గా ఆరుంపావుకల్లా సులక్షణ ఇంట్లో వున్నాను.

''కూర్చో అన్నయ్యా! ఇల్లు కనుక్కోవడం కష్టం కాలేదుకదా'' చీరకొంగుతో మొహాన్ని అద్దుకుంటూ కుర్చీ చూపించింది.

చిన్నగది. నాలుగు ఫేము కుర్చీలు. ఒక మూల చెక్కబల్లమీద పోర్టబుల్ బ్లాక్ అండ్ వైట్ టీవీ.

''ఏదో చిన్నవాళ్లం అన్నయ్యా! మీలా ఆఫీసర్ల కుటుంబంకాదు'' నేను నాలుగువైపులకీ చూడడం గమనించినట్లుంది సులక్షణ.

''ఛ! అదేంమాట! ఆఫీసర్లమని చెప్పుకోవడం తప్పించి బ్యాంకు ఇచ్చిన ఫర్నిచర్ తప్ప మా ఇంట్లో మాత్రం ఏం వున్నాయి కనుక? ఉన్నంతలో ఇల్లెంతో నీట్‌గా వుంచుకున్నావ్'' మనస్ఫూర్తిగా అన్నాను నేను.

''లోపలికి రా అన్నయ్యా చూద్దువుగానీ మా ఇంద్రభవనం''

బూట్లు కుర్చీ క్రింద విడిచి సులక్షణ వెనుకే లోపలికి నడిచాను. రెండోగది కాస్త పెద్దది. అయితే కిటికీ బొత్తిగా చిన్నది కావడంతో చీకటిగా వుంది. లైట్ స్విచ్ వేసింది సులక్షణ. ఆ గదిలో ప్లాస్టిక్‌వైరు మంచం పెద్ద సైజుది కిటికీవారగా గోడకి ఆనించి వేసి వుంది. ఓ ప్రక్క లోకల్‌మేడ్ ముదురు నీలంరంగు చిన్న బీరువా, రెండో ప్రక్క డ్రెస్సింగ్ టేబుల్. ఆ గది తరువాత పైన రేకులున్న చిన్న వంటగది. అందులోనే ఒకప్రక్కగా రెండు ఫోల్డింగ్ చైయిర్స్‌లున్న ఇనుప డైనింగ్ టేబుల్ వేసుకున్నారు.

స్టౌమీద కూర కలుపుతూ ''ఈ ఇంటికే ఎనిమిది వందల అద్దె అన్నయ్యా'' అంది సులక్షణ. నేనేమీ జవాబు చెప్పలేదు.

''నువ్వు ధర్మవరం వెళ్లి ఎన్నాళ్లయింది?'' మళ్లీ తనే మాట్లాడింది.

''నేను ఎక్కేది ధర్మవరం ఎక్స్‌ప్రెస్. దిగేది అనంతపురంలో. ఉద్యోగం అక్కడికి పదహారు కిలోమీటర్ల దూరంలోవున్న గార్లదిన్నెలో''

''బావుంది. పల్లెటూరి జీవితం అన్నమాట. మరి వదినకీ, పిల్లలకీ అక్కడ కాలక్షేపం ఏమిటి?''

''కుటుంబం వుండేది అనంతపురంలోనే. నేను రోజూ అప్ అండ్ డౌన్ చేస్తాను. ఇంతకీ మీ ఆయన ఉద్యోగం ఏమిటి?''

''ఇదివరలో కోఠి దగ్గర పాత పుస్తకాల షాపు వుండేది.

అందులో లాస్ వచ్చింది. ఇప్పుడు వాళ్ల బావగారితోపాటు సికింద్రాబాద్ మోండా దగ్గర రెడీమెడ్ బట్టల షాపు పెట్టారు. ప్రస్తుతానికది బావునట్లే వుంది'' నవ్వింది పల్చగా.

''అమ్మో! అప్పుడే పావుతక్కువ ఏడు. నీకు వడ్డించేస్తానన్నయ్యా. నీ భోజనం అయ్యేలోగా ఆయన వస్తారులే'' టేబుల్ కిందకు జరిపేసి వున్న కుర్చీని ఇవతలకి లాగి కంచం పెట్టింది నాకు.

రెండు కూరలు చేసి సాంబారు పెట్టింది. పాయసం చేసింది. బజ్జీలు వేయించింది.

''ఇవన్నీ ఎందుకు చెప్పు! నేనేం పరాయివాడినా?'' చేయి కడుక్కుని కంచంముందు కూర్చుంటూ మొహమాటపడ్డాను నేను.

భోజనం చేస్తుండగా కుటుంబం సంగతులన్నీ చెప్పుకు వచ్చింది సులక్షణ. శేఖరం పెళ్లయిన ఆరునెలలకే తండ్రి పోయాడుట. తండ్రి పోయాక శేఖరం ఎంతో మారిపోయాడుట. తల్లినీ, చెల్లినీ పట్టించుకునేవాడు కాదుట. తన పెళ్లి విషయమై అన్నయ్యకీ, తల్లికీ రోజూ పోట్లాటేనట. ఆఖరికి ఈ సంబంధం మేనమామ తీసుకువచ్చాడుట. గవర్నమెంట్ ఉద్యోగస్థుడు కాదని తల్లి సంశయిస్తుంటే కట్నం తక్కువని తల్లి నోరు మూసి ఈ పెళ్లి చేసాడుట శేఖరం.

భోజనం కాగానే చేయి కడుక్కుని పర్సులోంచి మూడువందల రూపాయల నోట్లు తీసి సులక్షణ చేతిలో పెట్టాను. ''మీ పెళ్లికి రాలేదుకదా! వద్దనడానికి వీల్లేదు'' మొహమాటపడి తిరిగి ఇచ్చేయబోతున్న సులక్షణ చేతిని వెనక్కి నెట్టాను.

''ఇంతకీ మీ ఆయనని పరిచయం చేయనేలేదు. ఏడుంపావు అవుతోంది. నేనిక బయలుదేరాలి'' నేను బూట్లు వేసుకుంటుండగా సులక్షణ వాళ్ల ఆయన వచ్చేసాడు.

''ఇప్పుడా రావడం? మరో రెండు నిముషాలుంటే అన్నయ్య వెళ్లిపోయేవాడు తెలుసా?'' పరస్పరం పరిచయాలు చేసింది సులక్షణ.

అతని మొహం చూడగానే అదిరిపడ్డాను నేను.

నన్ను చూడగానే ప్రసాదరావు మొహంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

నా గుండెలు కుతకుతలాడిపోతున్నాయి. ''ఈసారి నాలుగురోజులుండేలా అనంతపురం రా సులక్షణా!'' ముభావంగా నాలుగు పొడిముక్కలు అనేసి సూట్‌కేస్‌తో ఆ ఇంట్లోంచి బయటపడ్డాను నేను.

''అన్నయ్యను రైలెక్కించి రండి'' బలవంతంగా భర్తను నా వెనుకే తోసింది సులక్షణ.

నా వెనుకే వస్తూ ''పెట్టె నాచేతికివ్వండి సార్'' అంటూ నా జవాబు కోసం ఆశించకుండా సూట్‌కేసు అందుకున్నాడు ప్రసాదరావు.

సులక్షణ అమాయక మొహం కళ్లముందు మెదిలి నాకు దారంతా అగమ్యగోచరంగా వుంది. పాపం సులక్షణ. ఎంత నెమ్మదస్తురాలు. ఎంత గుణవంతురాలు. ఎంత ప్రేమగా వుంటుంది. అటువంటి అనురాగమూర్తికి భర్త ప్రసాదరావు!

నమ్మశక్యంగాలేదు నాకు.

దారిలో ప్రసాదరావుని అడిగాను ''నీ గురించి సులక్షణకంతా తెలుసా?''

''తెలియదు సార్. చెప్పకండి సార్. నేనిప్పుడు పూర్తిగా మారిపోయాను సార్'' గబగబా అన్నాడు ప్రసాదరావు.

నాకు అసహ్యం వేసింది.

''మారిపోయావన్నమాట. నా దగ్గర ఇది ఆరోసారో ఏడోసారో అనడం''

ప్రసాదరావు కాసేపు ఏమీ మాట్లాడలేదు.

''నిజం సార్. పెళ్లయ్యాక నేను పూర్తిగా మారిపోయాను సార్. నమ్మండి సార్'' రైలు వచ్చేదాకా అరిగిపోయిన రికార్డులా పదేపదే ఆ మాటలే అంటూ వచ్చాడు ప్రసాదరావు.

రైలు రాగానే సీటు కింద నా సూట్‌కేసు సర్ది రైలు దిగి కిటికీ దగ్గరకొచ్చి నిలబడ్డాడు ప్రసాదరావు.

''నా సంగతులేవీ సులక్షణకి చెప్పకండి సార్''

ప్రసాదరావు ముఖం చూడడం ఇష్టంలేక ప్లాట్‌ఫాం మీద హడావుడిగా కదులుతున్న మనుష్యుల్ని చూస్తూ ''సులక్షణ అమాయకురాలు. ఆమెకు అన్యాయం చేయకు'' అన్నాను కొంచెం కఠినంగా.

'అలాగే' అన్నట్లుగా బుర్ర ఊపాడు ప్రసాదరావు. రైలు కదిలేముందు ''అమ్మగారికీ, నాన్నగారికీ నమస్కారాలని చెప్పండి'' అన్నాడు చేతులు జోడిస్తూ.

నాకు రైలు ప్రయాణంలో నిద్ర పట్టదు. సులక్షణను గురించిన ఆలోచనలతో ఆ రాత్రంతా జాగరణే అయింది.

మహబూబ్‌నగర్‌లో మీటర్‌గేజ్ రైల్లోకి మారి దుప్పటి కప్పుకుని కళ్లు మూసుకుని పడుకున్నా నా కళ్లముందు ప్రసాదరావే కనిపిస్తున్నాడు.

నాన్నగారు రాజమండ్రి సెంట్రల్ జైల్ సూపరింటెంటుగా మూడేళ్లు చేసారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో వున్న నేను ఏడాదికి నాలుగైదుసార్లు రాజమండ్రి వెళ్తుండేవాడ్ని. జైల్లో ఖైదీలే మా ఇంట్లో అన్ని పనులు చేసేవారు. బట్టలు ఉతకడం, అంట్లు తోమడం, ఇల్లు తుడవడం, బట్టలు ఇస్త్రీ, తోట పనీ-ఇలా అన్ని పనులూ ఖైదీలే చేసేవారు. దాదాపు రోజంతా నలుగురైదుగురు ఖైదీలు మా ఇంట్లోనే వుండేవారు. ఈ ప్రసాదరావు చిన్నాచితకా దొంగతనాలు చేస్తూ తరచూ జైలుకొస్తుండేవాడు. వాడు కోరి మా ఇంటి పనికే వచ్చేవాడు. మా ఇంట్లో పిల్లలతో కాలక్షేపం అనీ, రకరకాల టిఫిన్లు దొరుకుతాయనీ, చదువుకోవడానికి బుక్స్ వుంటాయని మా ఇల్లంటే ఆకర్షణ వాడికి. వాడు కబుర్లపోగు. కాస్తోకూస్తో చదువుకున్నాడు. పని అంతా అయ్యాక ఏ జామ చెట్టు కిందో కూర్చుని భూమి, జ్యోతి తిరగేస్తూ వుండేవాడు.

''నిండా ఇరవై ఏళ్లు లేవు. టెన్త్ క్లాస్ పాస్



## అన్యాయం

''నీ భార్యకు ఉరి బిగించి చంపావని సాక్ష్యాధారాలు రుజువు చేస్తున్నాయి. మర్యాదగా నేరం ఒప్పుకో శిక్ష తగ్గుతుంది'' అన్నాడు లాయరు బోనులో నిలబడ్డ సుబ్బారావుని.

''పదిమంది పెద్దల సమక్షంలో మూడు ముళ్లు ఆమె మెడలో వేస్తే వివాహబంధం అన్నారు. ఒక్కటి వేస్తే అది ఉరి అంటున్నారు. ఇది అన్యాయం'' అరిచాడు సుబ్బారావు.


-లకనం మూర్తి (కాకినాడ)



## మంచి కథ

ఇటీవల రామానాయుడు స్టూడియోలో హీరో వెంకటేష్‌ని కలసినప్పుడు తన మనసులోని అభిప్రాయాన్ని ఈ విధంగా వివరించాడు. ''ఏ చిత్రంలోనైనా, ఏ హీరో అయినా నటించేటప్పుడు చక్కని కథను ఎన్నుకుంటాడు. అలాగే నేను కూడా కథను ఎన్నుకుంటున్నాను. కథలో నా క్యారెక్టర్ గురించి నేను ఆలోచించను. మంచి కత, మంచి డైరెక్టర్, మంచి అభిరుచిగల నిర్మాతను ఎన్నుకుంటాను. అంతేగానీ అవకాశాలు వచ్చాయిగదా అని ఇష్టం వచ్చినట్టు నటించకూడదన్నది నా అభిప్రాయం.'' అన్నాడు

-భవానీ సుబ్బారావు



అయ్యానంటున్నావు. ఇటువంటి చేతివాటితనం పనులు మానేసి ఏమయినా ఉద్యోగం చూసుకోకూడదు. ఇలా జైలుకు రావడం సిగ్గుగా లేదు నీకు?'' అంటూ చాలాసార్లు ప్రసాదరావును తిట్టేవాడిని నేను.

''మీ ఇంట్లో పనికి వచ్చాక మిమ్మల్ని చూసి పూర్తిగా మారిపోయాను సార్. చూస్తుండండి. ఈసారి విడుదల కాగానే ఏదయినా జాబ్ చూసుకుని స్వీట్ పాకెట్ తీసుకుని మీ ఇంటికి వస్తాను'' అనేవాడు ప్రసాదరావు.

ఆ మూడేళ్లలో అలా అంటూనే ఐదారుసార్లు జైలుకి వచ్చాడు. నేను హైదరాబాద్ నుంచి వచ్చినరోజున సిగ్గుపడి మొహం చాటేసేవాడు. ఆ తరువాత మళ్లీ మామూలే!

వాడిని తిడుతుంటే ''ఎందుకురా నీకా కంఠశోష? మనుషులు అంత త్వరగా మారరురా'' అనేది అమ్మ.

అటువంటి ప్రసాదరావు మాటలతో అందరినీ బోల్తా కొట్టించి సులక్షణ మొగుడయ్యాడన్న మాట. ఎంత ఘోరం జరిగిపోయింది!

అయినా ప్రసాదరావు మారానంటున్నాడు. నిజంగానే మారిపోయాడేమో? ఏడాదిగా కుదురుగానే కాపురం చేసుకుంటున్నాడు. వాడు నిజంగా మారి సులక్షణని ప్రేమగా చేసుకుంటే అంతే చాలు''

సులక్షణ కాపురం గురించి కలత పడుతుండగానే తెల్లారిపోయింది. అనంతపురం వచ్చేసింది.

శ్రీమతి శేఖరం, సులక్షణ పేర్లు వినడం తప్పించి వాళ్లను చూడలేదు.

ఆ కుటుంబం గొడవలేవీ ఆవిడకి ఆసక్తి కలిగించలేదు. నేను • గంటసేపు శ్రమపడి జరిగిందంతా చెబితే ''అలాగా! అన్నట్లు టమాటాలు అయిపోయాయి. తెచ్చిపెడతారా?'' అంది తను.

అనుకోకుండా నాలుగు నెలల్లోనే మళ్లీ హైదరాబాద్ ప్రయాణం పడింది నాకు ప్రమోషన్ టెస్టు రాయడానికి.

టెస్టు వ్రాసి హోటల్‌లో భోజనం చేసి ఒక డజను కమలాపళ్లు, డజను ఏపిల్ పళ్లు తీసుకుని సులక్షణ ఇంటికి వెళ్లాను.

కరెంట్ లేదేమో కాలింగ్‌బెల్ మోగలేదు.

నాలుగుసార్లు బాదాక తలుపుతెరుచుకుంది.

తీసింది సులక్షణ కాదు ప్రసాదరావు.

ఆదివారం కాబట్టి ఇంట్లోనే వున్నట్టున్నాడు.

నన్ను చూడగానే వాడి మొహం మాడిపోయింది.

''లోపలికి రండి సార్'' వంటింట్లోకెళ్లి గ్లాస్‌లో నీళ్లు తెచ్చి ఇచ్చాడు.

''సులక్షణ లేదా?'' చుట్టూ చూస్తూ అడిగాను.

లేదన్నట్లు తల ఊపాడు.

నాకు అనుమానం వేసింది.

మంచినీళ్లు తాగకుండా గ్లాసు కిటికీలో పెట్టేస్తూ ''ఎక్కడికి వెళ్లింది? ఎప్పుడు వస్తుంది?'' అని అడిగాను సూటిగా.

తల వంచుకున్నాడు వాడు.

''అనుకున్నంతా అయింది. నీతో ఏ ఆడది కాపురం చేయగలదురా దరిద్రుడా! మళ్లీ ఏం వెధవ పని చేసావ్?'' ఇంకా ప్రసాదరావు మా ఇంట్లో ఖైదీ అన్నట్లుగానే అరిచాను.

ప్రసాదరావు నిశ్శబ్దంగా లోపలికెళ్లి ఏదో కాగితం తెచ్చి నా చేతిలో పెట్టాడు.

అది సులక్షణ వ్రాసింది.

మీకు,

మిమ్మల్ని నేను క్షమించమని అడగడంలేదు. మీరు నన్ను కష్టపెట్టారని, నన్ను ప్రేమగా చూసుకోలేదని నింద కూడా వేయడంలేదు. మన వీధి చివర టైలర్‌షాపులో వుండే హనీఫ్ నాకు నచ్చాడు. అతనితోపాటు బొంబాయి వెళ్లిపోతున్నాను. నా కోసం వెతికించవద్దు. ఇక నేను వెనుతిరిగి రావడం అంటూ జరగదు. నన్ను మర్చిపోవడం మంచిది.

-సులక్షణ

ఉత్తరం చదివిన నా తల గిర్రున తిరిగిపోయింది.

''మనుషులు అంత త్వరగా మారరురా'' అమ్మ అన్న మాటలు గుర్తుకు వస్తున్నాయి.

లేదు- మనుషులు మారతారు.

అమాయకురాలైన సులక్షణ ఇంతకు తెగిస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు.

కళ్లజోడు తీసి తుడుచుకున్నా ప్రసాదరావు కళ్లలో తడి మసక మసకగానే కనిపిస్తోంది నాకు!



## చెయిను

''రైల్లో చెయిన్ లాగినందుకే నీకు రెండునెలల జైలా?''

''అవును మరి మెడలో చెయిను కదా లాగింది?''


-సునాద్ (ర్యాలీ)

## అచ్చం

''రాధా! నన్ను లతలా అల్లుకుపోతున్నావ్''

''నువ్వు అంతే గోపీ అచ్చం మోహన్‌లా అల్లుకుపోతున్నావ్''

-తిరుమలరాజు రఘువర్మ (దేవుపల్లి)



## రాఘవేంద్రరావు

సినిమాలో కంటిన్యుటీకి స్వస్తి చెప్పి తన థాట్‌ని యాజిటీజ్‌గా ప్రజెంట్ చేయగల శక్తి రాఘవేంద్రరావుకే వుందంటే అతిశయోక్తి కాదు. ఈమధ్య ఎక్కడ విన్నా రాఘవేంద్రరావు నృత్య దర్శకుడు లేకుండా పిక్చరైజ్ చేసిన 'పెళ్లి సందడి' పాటలను గురించే. రాఘవేంద్రరావు గోదావరి, కోనసీమ అందాల్ని కనువిందు చేసేలా చిత్రీకరించారని అంటున్నారు. మరి ఎంతవరకు సఫలీకృతుడయ్యాడో సినిమా విడుదలయ్యాక ప్రేక్షకులు చెబుతారు.

-సాయిరాం

